సాక్షి విశాఖపట్నం

బుధవారం । 26 । జూన్ । 2024



ఇంటర్‌తోనే ఉపాధి

స్వశక్తితో ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో నేటితరం యువత అనువైన మార్గాలను అన్వేషిస్తోంది. 8లో



జల్సాల కోసం దొంగతనాలు

జల్సాలకు అలవాటు పడి.. అత్యాశతో దొంగతనాలకు పాల్పడిన నలుగురు కటకటాలపాలయ్యారు. 8లో



ప్రత్యేక రైళ్లు పొడిగింపు

పలు వీక్లీ స్పెషల్ రైళ్లు మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

1 నుంచి శ్రీవారి సేవలు



శ్రీవారి ఆలయ ముఖద్వారం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జూలై 1వ తేదీ నుంచి శ్రీవారి సేవల్లో భక్తులు పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు దేవస్థానం నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే సుప్రభాత సేవకు ఒకరికి రూ.100, పుష్పాలంకరణకు రూ.12,000(నలుగురు కుటుంబ సభ్యులు), 8 గంటలకు నిర్వహించే తోమాల సేవకు ఒక్కొక్కరికి రూ.200, 8.30 జరిగే సహస్ర నామార్చనకు ఒక్కొక్కరికి రూ. 200, 9.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు జరిగే అర్చనకు ఒక్కొక్కరికి రూ.100, ప్రతీ శుక్రవారం ఉదయం 6.30 గంటలకు నిర్వహించే శ్రీవారి అభిషేకానికి ఒక్కొక్కరికి రూ. 250, ఏకాంత సేవకు రూ.100, వేదాశీర్వచనానికి రూ.1,500 (నలుగురు వరకు), భోగంనకు రూ.10,000 చొప్పున నిర్ణయించారు. ఈ సేవల్లో పాల్గొనే భక్తులు దేవస్థానాన్ని సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

ఏయూ దూరవిద్యా కేంద్రం సంచాలకుడిగా విజయ్‌మోహన్



ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆచార్య విజయ్ మోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రం సంచాలకుడిగా ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ సీనియర్ ఆచార్యుడు ఎస్.విజయ్‌మోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి నుంచి మంగళవారం ఆయన నియామక ఉత్తర్వులు స్వీకరించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య విజయ్‌మోహన్‌ను వర్సిటీ ఆచార్యులు, ఉద్యోగులు అభినందించారు.

28, 29 తేదీల్లో జాబ్ మేళా



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్

మహారాణిపేట : మద్దిలపాలెంలోని వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈనెల 28, 29 తేదీల్లో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆవిష్కరించారు. టెక్ మహీంద్రా సంస్థలో 328 బీపీవో ఉద్యోగాల ఎంపిక కోసం నిర్వహించనున్న ఈ మేళాకు జిల్లా ఉపాధి కార్యాలయం, నోడల్ జవహర్ నాలెడ్జి సెంటర్ సంయుక్తంగా సహకారం అందిస్తున్నాయి. డిగ్రీ పాస్ లేదా ఫెయిల్, ఇంగ్లిష్ కమ్యూనికేషన్‌లో ప్రతిభ గల వారు అర్హులు. అర్హత గల అభ్యర్థులు https@//me-qr.com/niVxxcpx లింక్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఉత్తరాంధ్రలోని జిల్లాల వారు ఆయా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌ల్లో ఆన్‌లైన్‌లో https@// employment.ap.gov.in వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు.

'పద్మ' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: కేంద్ర ప్రభుత్వం.. 2025 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించే 'పద్మ' అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డులకు దరఖాస్తు చేసే వారు పలు రంగాల్లో విశిష్ట సేవ లు అందించి ఉండాలని పేర్కొన్నారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామా జిక/సాంఘిక సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ప్రజా సంబంధాలు, సివిల్ సర్వీసులు, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ రంగాల్లో విశిష్ట సేవలందించినవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. https://awards.gov.in ద్వారా వచ్చే నెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ దరఖాస్తు జిరాక్స్ కాపీతో పాటు సాఫ్ట్ కాపీని జిల్లా యువజన సంక్షేమ అధికారి/ముఖ్య కార్యనిర్వహణాధికారి, సెట్విస్ కార్యాలయం, యువజన భవన్, మహారాణిపేట చిరునామాలో సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు కార్యాలయం పని వేళల్లో సెట్విస్ సీఈవోను సంప్రదించాలన్నారు.

ఎండా.. వాన



ఉదయం ఎండలో..

- నగరంలో భిన్న వాతావరణం
- శివారులో భారీ వర్షం
- పెందుర్తిలో 4.5 సెం.మీల వర్షపాతం



మధ్యాహ్నం గొడుగు నీడలో..



సాయంత్రం కురిసిన వర్షంలో వాహనచోదకులు



జాతీయ రహదారిపై భారీ వర్షం

సాక్షి, విశాఖపట్నం : నగరంలో మంగళవారం భిన్న వాతావరణం నెలకొంది. పగలంతా జనాన్ని ఎండ మలమలా మాడ్చింది. సాయంత్రానికి ఆకాశం మేఘావృతంగా మారి చల్లదనాన్ని పరిచింది. ఉదయం నుంచి ఎండ వేడిమి మొదలై సాయంత్రం వరకు కొనసాగింది. దీంతో నగరంలో 36.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణంకంటే నాలుగు డిగ్రీలు అధికం. దీంతో ఎండాకాలంలో కాసే ఉష్ణతాపాన్ని తలపించింది. దీనికి ఉక్కపోత కూడా తోడైంది. ఇలా పగలంతా అసౌకర్య వాతావరణమే కొనసాగింది. సాయంత్రం అయ్యేసరికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశంలో కారుమేఘాలు కమ్ముకున్నాయి. ఆ కాసేపటికే నగర శివారుల్లోని పెందుర్తి, పద్మనాభం, భీమిలి ప్రాంతాల్లో జోరుగా భారీ వర్షం కురిసింది. మిగిలిన చోట్ల తేలికపాటి వర్షంతో సరిపెట్టింది. పెందుర్తిలో 4.5 సెం.మీలు, పద్మనాభంలో 3.5 సెం.మీ, భీమిలి మండలం కాపులుప్పాడలో 2.3 సెం.మీ, గోపాలపట్నంలో 2 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. రానున్న రెండు రోజులు కూడా విశాఖలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

విధులకు ట్రెజరీ ఉద్యోగుల డుమ్మా

ఎనిమిది మందికి మెమోలు

మహారాణిపేట: కలెక్టరేట్ కేంద్రంగా ఉన్న ట్రెజరీ కార్యాలయం ఉద్యోగులకు శ్రీముఖాలు అందాయి. విధులకు డుమ్మా కొట్టిన 8 మంది ఉద్యోగులకు మెమోలు జారీ చేసిన ట్రెజరీ శాఖ ఉన్నతాధికారులు.. వెంటనే వివరణ ఇవ్వకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అందులో స్పష్టం చేశారు. ఉద్యోగులు విధుల్లో ఉండటం లేదన్న విషయం ఓ విశ్రాంత ఉద్యోగి ఆర్‌టీ యాక్ట్ కింద దరఖాస్తు చేయడంతో వెలుగులోకి వచ్చాయి. ట్రెజరీ వర్గాల్లో చర్చనీయాంశమైన విషయంపై వివరాలివీ..

జిల్లాల పునర్ విభజనతో విశాఖ జిల్లా పరిధి తగ్గిపోయింది. సీతమ్మధార ఏటీవో కార్యాలయం, భీమిలి సబ్ ట్రెజరీ కార్యాలయంతోపాటు జిల్లా కలెక్టరేట్‌లో ట్రెజరీ ప్రధాన కార్యాలయం ఉంది. మొత్తం అంతా కలిపి సుమారు 50 మంది వరకు ఉద్యోగులు, అధికారులు ఉన్నారు. ఇక్కడ పని చేస్తున్న జిల్లా ట్రెజరీ అధికారి/ఉప సంచాలకుడు సుధాకరరావు కొంతకాలంగా సెలవులో ఉన్నారు. సీతమ్మధార ఏటీవో గోవిందరావు ఇన్‌చార్జి డీటీవోగా వ్యవహరిస్తున్నారు. ఉద్యోగుల సమయపాలన లేకపోవడంతోపాటు కార్యాలయ నిర్వహణ సరిగా లేకుండా పోయింది. కొంత మంది ఉద్యోగులు ఉదయం 10.30 గంటలకు వచ్చి.. ముఖ ఆధారిత హాజరు వేసుకుని, రిజిస్టర్‌లో సంతకం చేసి బయటకు వెళ్లిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొంత మంది అసలు విధులకు హాజరుకావడం లేదు. వివిధ పనుల నిమిత్తం ట్రెజరీకి ఎంతో మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు వస్తుంటారు. ఇందులో ఓ విశ్రాంత ఉద్యోగి తన వ్యక్తిగత పని కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సమయ పాలన లేకపోవడం, కార్యాలయంలో ఎవరూ సీటులో అందుబాటులో ఉండడం లేదని గుర్తించారు. పదే పదే కార్యాలయానికి వచ్చినా ఉద్యోగులు అందుబాటులో ఉండడం లేదని నిర్ధారించుకున్న తర్వాత ఆర్‌టీ యాక్ట్ కింద ఉద్యోగుల వివరాలు కావాలని దరఖాస్తు పెట్టారు. దీనికి సంబంధిత శాఖ నుంచి సరైన సమాధానం రాకపోవడంతో తిరిగి దరఖాస్తు చేశారు. ఈ విషయం అమరావతిలోని ట్రెజరీ డైరెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో ఉన్నతాధికారులు ఇక్కడ వ్యవహారాల మీద దృష్టి పెట్టారు. విధులకు సరిగ్గా హాజరుకాని 8 మందికి మెమోలు జారీ చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇద్దరు ఎస్‌ఐల బదిలీ

ఏయూక్యాంపస్: నగరంలో ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎస్‌బీలో ఉన్న ఎస్.నరసింగరావు పెందుర్తి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు, సిటీ వీఆర్‌లో ఉన్న ఎం.డి సల్మాన్ బేగ్ మూడో పట్టణ క్రైం పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

మానవతావాది.. పరిపాలన సంస్కర్త

- పూర్వ కలెక్టర్‌సేవలను కొనియాడిన జిల్లా ఉన్నతాధికారులు
- ఘనంగా డాక్టర్ ఎ.మల్లికార్జున ఆత్మీయ వీడ్కోలు సభ



పూర్వ కలెక్టర్ మల్లికార్జున దంపతులకు జ్ఞాపిక బహూకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్, జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్



మాట్లాడుతున్న పూర్వ కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో జిల్లా అధికారులు

ఏయూక్యాంపస్: తన పరిపాలన విధానాలు, సేవా భావంతో జిల్లా ప్రజలందరి మనసులను గెలుచుకున్న జిల్లా పూర్వ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గొప్ప మానవతావాది, పరిపాలన సంస్కర్త అని జిల్లా అధికారులు అన్నారు. ఆయన జిల్లాకు అందించిన సేవలను శ్లాఘించారు. జిల్లాలో వైద్యరంగం, పరిపాలన విధానంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. ఆయన మృదు స్వభావి, సహన శీలి అని కితాబిచ్చారు. జిల్లా కలెక్టర్‌గా దాదాపు మూడేళ్లు ఉత్తమ సేవలందించి బదిలీపై వెళ్తున్న డాక్టర్ ఎ.మల్లికార్జునకు దసపల్లా హోటల్‌లో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సభ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ ఒకవైపు సేవా దృక్పథం కనబరుస్తూ.. మరో వైపు పరిపాలన దక్షత చూపుతూ అందరి మన్ననలు అందుకున్న కలెక్టర్‌గా డాక్టర్ ఎ.మల్లికార్జున నిలిచిపోతారన్నారు. ఆయన నుంచి ఎన్నో విషయాలు తాను నేర్చుకున్నానన్నారు. ఎటువంటి సవాలు ఎదురైనా సులభంగా ఎదుర్కోవడం అనేది ఆయన్ని చూసి తెలుసుకోవచ్చన్నారు. మంచి ఆలోచన, మంచి విజన్ ఉన్న ఆయన భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, పోలీస్ జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ఆయన సేవలను కొనియాడారు. ఆస్పత్రులు, పాఠశాలలు, వసతిగృహాల్లో ఎన్నో సదుపాయాలు కల్పించారని గుర్తు చేశారు.

జిల్లాతో మరచిపోలేని అనుబంధం

విశాఖ జిల్లాలో దాదాపు మూడేళ్లు పనిచేశానని.. జిల్లాతో, ఇక్కడి ప్రజలతో విడదీయరాని అనుబంధం ఏర్పడిందని పూర్వ కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. విశాఖ జిల్లా ప్రశాంతతకు మారుపేరని, ఇక్కడి ప్రజలు సౌమ్యులన్నారు. ఇప్పటివరకు చాలా చోట్ల పని చేశానని, అన్నిటి కంటే విశాఖ జిల్లా ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. తన పరిపాలన సమయంలో అన్ని విధాలుగా సహకరించిన ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివిధ విభాగాల జిల్లా ఉన్నతాధికారులు, రెవెన్యూ, ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు కలెక్టర్ మల్లికార్జున దంపతులను సత్కరించారు.

ఉచిత ప్రయాణంపై కసరత్తు!

- మహిళలు ఎక్కువగా ప్రయాణించే రూట్లపై ఆరా
- నగరంలోకి ఎక్కడ నుంచి వస్తున్నారో అధ్యయనం
- డిమాండ్ లేని రూట్ల బస్సులను మళ్లించే యోచన
- ప్రస్తుతానికి ఆర్డినరీ బస్సుల్లోనే ఫ్రీకి అవకాశం?



ఆర్టీసీ బస్సులో మహిళా ప్రయాణికులు

సాక్షి, విశాఖపట్నం : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని ప్రభుత్వం ఎప్పట్నుంచి అమలు చేస్తోందని మగువలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కొద్దిరోజుల్లో దీనిపై కార్యాచరణ రూపొందిస్తామని రవాణాశాఖ మంత్రి చెబుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు కూడా తమ వంతు కసరత్తు చేస్తున్నారు. విశాఖ నగరంలోకి వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఎక్కువ మంది వస్తున్నారు? వీరు ఏఏ రూట్లలో ఎక్కువగా ప్రయాణిస్తున్నారు? వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. ఇలా నగరంలోకి కొత్తవలస, పెందుర్తి, ఆనందపురం, ఆరిలోవ, డైరీ ఫారం, కొమ్మాది, తగరపువలస, అనకాపల్లి, చోడవరం, సబ్బవరం తదితర ప్రాంతాల నుంచి మహిళలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నట్టు ప్రాథమికంగా గుర్తించారు. వీరిలో ఆస్పత్రులు, షాపులు, షాపింగ్ మాళ్లు, వస్త్ర దుకాణాలు, పరిశ్రమలు, హోటళ్లలో పనిచేస్తున్న మహిళలు అధికంగా ఉన్నారు. వీరే కాకుండా వివిధ పనులు, ఉపాధి కోసం రోజూ వచ్చి వెళ్లే వారు, షాపింగ్‌కు వచ్చేవారు, పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీల్లో చదువుల కోసం రాకపోకలు సాగించే విద్యార్థినులు ఉన్నారు. వీరందరినీ ఆర్టీసీ అధికారులు కేటగిరీల వారీగా వేరు చేస్తున్నారు.

డిమాండ్ లేని రూట్ బస్సుల మళ్లింపు?

ఉచిత బస్సు ప్రయాణం పథకం అమల్లోకి వస్తే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం ప్రయాణించే మహిళల కంటే సగటున 25 శాతం పెరగవచ్చని అంచనా. దీంతో ఇప్పుడు నడుస్తున్న బస్సులు వీరి అవసరాలను తీర్చలేవు. అందుకనుగుణంగా ఇప్పటికిప్పుడు బస్సులను పెంచే పరిస్థితి కూడా లేదు. అందువల్ల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) తక్కువగా ఉండి రద్దీ లేని రూట్లలో తిరుగుతున్న బస్సులను మహిళలు ఎక్కువగా ప్రయాణించే రూట్లకు మళ్లించాలన్న యోచనలో ఉన్నట్టు సమాచారం.

తీరనున్న ఓఆర్ బెంగ

మరోవైపు ఆర్టీసీకి ఎప్పుడూ ఓఆర్ బెంగే వెంటాడుతుంది. ఓఆర్ పెరగడానికి ఆర్టీసీ అధికారులు తంటాలు పడుతుంటారు. అయితే ఇప్పుడు మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తే ఓఆర్ ఊపందుకుంటుందని ఆర్టీసీ అధికారులు లోలోన సంబరపడుతున్నారు. ఆర్టీసీ విశాఖ జిల్లా రీజియన్‌లో ప్రస్తుతం సగటు ఓఆర్ 65 శాతం ఉంది. ముందుముందు అది గణనీయంగా పెరుగుతుందని వీరు చెబుతున్నారు. మహిళా ప్రయాణికులకయ్యే చార్జీల సొమ్మును ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్ చేస్తుంది. అందువల్ల ఈ పథకం వల్ల తమ సంస్థకేమీ నష్టం ఉండబోదని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతానికి ఆర్డినరీలకేనా?

తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీసీ ఆర్డినరీ, పల్లెవెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అనుమతిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రస్తుతానికి ఆర్డినరీ, పల్లెవెలుగు బస్సుల్లోనే వీరికి ఛాన్స్ ఇస్తారన్న ప్రచారం ఉంది.

సాగదీతకే ప్రాధాన్యం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలును సాధ్యమైనంత కాలం సాగదీయడానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్న వాదన వినిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు రీయింబర్స్‌మెంట్ సొమ్ము భారీ మొత్తంలో ఉంటుంది. అందువల్ల ఆ భారాన్ని తగ్గించుకోవడానికి అధ్యయనం, పరిశీలనల పేరిట ఏదో వంక చూపుతూ కాలయాపన చేస్తోందన్న ప్రచారం జరుగుతోంది.

ఆటోల ఆదాయానికి గండి

ఇక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ఆచరణలోకి వస్తే మొట్టమొదటగా ఆటో డ్రైవర్ల ఆదాయానికే గండి పడుతుంది. ప్రస్తుతం మహిళలు చాలావరకు ఆటోల్లో రాకపోకలు సాగించడానికే మొగ్గు చూపుతున్నారు. బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటోలను ఆశ్రయించే మహిళలు నామమాత్రంగానే ఉండనున్నారు. ఇదే ఇప్పుడు వీరిని ఆందోళనకు గురి చేస్తోంది.

కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయండి

కమిషనర్‌కు మేయర్ లేఖ

డాబాగార్డెన్స్: ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ యాక్ట్ 1955 ప్రకారం కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని మేయర్ గొలగాని హరివెంకటకుమారి జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు లేఖ రాశారు. వార్డుల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి వెంటనే కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని లేఖలో సూచించారు.

జీవీఎంసీ బడ్జెట్‌పై ఈ ఏడాది జనవరిలో కౌన్సిల్ సమావేశం జరిగింది. మేయర్ అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో సభ్యులు చర్చించి ఆమోదించారు. అదే సమావేశంలో పలువురు కార్పొరేటర్ల విజ్ఞప్తి మేరకు ప్రతీ వార్డుకు రూ.2కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మేయర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ సమావేశం నిర్వహించి దాదాపు ఆరు నెలలు కావస్తోంది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తిరిగి సమావేశం జరగలేదు. అలాగే స్థాయీ సంఘ సమావేశం మార్చి 6న నిర్వహించారు. ఈ సమావేశం కూడా నిర్వహించి మూడు నెలలు కావస్తోంది. ఫలితంగా పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. గత స్థాయీ సంఘ సమావేశంలో మొత్తంగా 96 అంశాలు పొందుపరచగా.. వాటిని స్థాయీ సంఘం సభ్యులు చర్చించి ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

జైల్‌లో మానసిక వైద్యులు అవసరం



జైల్ సూపరింటెండెంట్ కిశోర్‌కు పుస్తకం అందిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి రామారావు

ఆరిలోవ: కారాగారంలో ఖైదీల కోసం మానసిక వైద్యుడు అవసరమని జిల్లా మానసిక సమీక్ష బోర్డు చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.రామారావు తెలిపారు. విశాఖ కేంద్ర కారాగారాన్ని మంగళవారం జిల్లా మానసిక సమీక్ష బోర్డు సభ్యులు సందర్శించారు. బ్యారక్‌ల్లో ఖైదీలతో మాట్లాడారు. వారి మానసిక పరిస్థితి పరిశీలించారు. అనంతరం జైల్ సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జైల్‌లో ఖైదీలకు మానసిక పరిస్థితిపై అవగాహన కల్పించడం తదితర వాటి గురించి చర్చించారు. ఈ సందర్భంగా బోర్డు చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.రామారావు మాట్లాడుతూ ఖైదీలకు నిరంతరం మానసిక వైద్యం అందించాల్సిన అవసరం ఉందన్నారు. దీని కోసం మానసిక వైద్య నిపుణులు జైల్‌లో అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో బోర్డు సభ్యులు ఎ.సుచిత్ర, డాక్టర్ కె.వి రామిరెడ్డి, జైల్ అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ రామచంద్రరావు పాల్గొన్నారు.

'స్టాప్ డయేరియా'పై ప్రత్యేక కంట్రోల్ రూమ్

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ



మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: 'స్టాప్ డయేరియా'పై ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, ఇతర ఉన్నతాధికారులతో 'స్టాప్ డయేరియా'క్యాంపైన్ కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అతిసార వ్యాధి వ్యాపించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జీవీఎంసీ సిటీ ఆపరేషన్ సెంటర్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందన్నారు. మురుగు నీరు, కలుషితమైన నీరు సరఫరా, కాలువలు, గెడ్డలు పొంగిపొర్లినా.. మలేరియా, డయేరియా, డెంగ్యూ వ్యాధులు సోకినా కంట్రోల్ రూమ్ నంబర్ 0891–2869109కు ప్రజలు తెలియజేయాలని సూచించారు. స్టాప్ డయేరియా క్యాంపైన్ జూలై ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు కొనసాగుతుందని వెల్లడించారు. సచివాలయ ఏఎన్‌ఎంలు ప్రతీ ఇంటికి వెళ్లి.. ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అతిసార వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగడం, పరిశుభ్రత కలిగి ఉండాలన్నారు. ప్రతి రోజూ డయేరియా, మలేరియా, డెంగ్యూ వ్యాధులపై నివేదిక అందజేయాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. అతిసార వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎంపీడీ ఫణిరామ్‌కు సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్ వర్మ, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణంరాజు, పర్యవేక్షక ఇంజినీర్ కేవీఎస్ రవి, బయాలజిస్ట్ సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడికి యత్నించిన ఇద్దరికి ఐదేళ్ల జైలు

విశాఖ లీగల్: బుద్ధిమాంద్యం గల బాలికపై లైంగిక దాడికి యత్నించిన ఇద్దరు యువకులకు ఐదేళ్లు జైలు శిక్ష, ఒక్కొక్కరు రూ.15 వేలు చొప్పున జరిమానా చెల్లించాలని నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానా సొమ్మును బాలికకు ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితులు బొజ్జ సత్యనారాయణ, జలసూత్రం వరం గాజువాకలోని గుడివాడ అప్పన్న కాలనీలో ఉంటున్నారు. స్నేహితులైన వీరు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 2016 జనవరి 20వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో బుద్ధిమాంద్యం గల బాలిక సమీపంలోని పాఠశాలకు వెళ్లి వస్తుండగా నిందితులు ఆమెపై కన్నేశారు. జింక్ వెనుక వైపు ఉన్న దారిలో కాపు కాశారు. బాలిక ముందు ఆమె అమ్మమ్మ ఎస్.లక్ష్మి కూడా ఉంది. ఇద్దరు యువకులు బైక్‌పై బాలికను అపహరించి లైంగిక దాడికి ప్రయత్నించారు. పక్కనే ఉన్న బాలిక అమ్మమ్మ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు గుమిగూడారు. దీంతో వారు బైక్‌ను అక్కడే వదిలేసి పారిపోయారు. బాధితురాలి అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు నిందితులపై భారతీ శిక్షాస్మృతి 354 ఏ కింద కేసు నమోదు చేశారు. అలాగే పోక్సో చట్టం కింద కూడా కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారు.

జల్సాల కోసం బైక్ దొంగతనాలు

- నలుగురి అరెస్ట్, ఆరు బైక్‌ల స్వాధీనం
- అంతా 20 ఏళ్ల వయసులోపు వారే..


వివరాలు వెల్లడిస్తున్న క్రైం డీసీపీ వెంకటరత్నం

అక్కిరెడ్డిపాలెం: చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడి.. సులభంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో దొంగతనాలకు పాల్పడిన నలుగురు కటకటాలపాలయ్యారు. పలు చోట్ల బైక్‌లు, సెల్‌ఫోన్లను దొంగలించిన వీరిని క్రైం పోలీసులు పట్టుకున్నారు. గాజువాక పోలీస్‌స్టేషన్‌లో క్రైం డీసీపీ ఎం.వెంకటరత్నం మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. ఈ నెల 20న తన బైక్ చోరీకి గురైందని గాజువాకకు చెందిన బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటి ఆవరణలో బైక్ నిలిపి, ప్రహరీకి తాళం వేశానని, తర్వాత రోజు ఉదయం చూస్తే ప్రహరీ తాళం విరగ్గొట్టి ఉందని, బైక్ చోరీకి గురైందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇటువంటి నేరాలే గాజువాక, ద్వారకానగర్, న్యూ పోర్టు, ఆనందపురం, ఎయిర్‌పోర్టు, 2 టౌన్, 3 టౌన్ పరిధిలో కేసులు నమోదైనట్లు డీసీపీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తుకు జోన్-2 క్రైం ఏసీపీ సీహెచ్ శ్యామలరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బైక్ దొంగతనానికి పాల్పడుతున్న ఇద్దరిని సీసీ ఫుటేజీల్లో గుర్తించారు. ఈ క్రమంలో సోమవారం షీలానగర్ అయ్యప్ప స్వామి ఆలయం సిగ్నల్ పాయింట్ వద్ద ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మరింత సమాచారం సేకరించి.. మరో ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. వీరిలో మాధవధార పెన్ స్కూల్ వెనుక నివాసం ఉంటున్న 20 ఏళ్ల సుంకర జగదీష్, కంచరపాలెం బాపూజీ నగర్‌కు చెందిన 19 ఏళ్ల చిక్కాల భరత్ ఉన్నారు. వీరి నుంచి సేకరించిన సమాచారంతో ఆరు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకే..

నిందితులంతా మధ్య తరగతి కుటుంబానికి చెందిన వారేనని డీసీపీ తెలిపారు. పైగా వీరంతా 20 ఏళ్ల వయసులోపే ఉన్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారు? కళాశాలలకు వెళ్తున్నారా? వారిలో నిత్యం వచ్చే మార్పులేమిటి? తదితర అంశాలను గమనించాలని సూచించారు. పిల్లలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల చెడు వ్యసనాలను గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన నలుగురు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలయ్యారని డీసీపీ వివరించారు. రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన బైక్‌ల సంరక్షణకు సరైన జాగ్రత్తలు పాటించాలని నగర ప్రజలకు ఆమె సూచించారు. వీల్ లాకర్‌ను తప్పనిసరిగా వినియోగించాలన్నారు. వాహన కంపెనీలు బైక్‌లకు జీపీఎస్ ట్రాకర్ అమర్చిన తర్వాతే విక్రయించాలన్నారు. ఈ కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఆమె అభినందించారు. జోన్-2 క్రైం ఏసీపీ సీహెచ్ శ్యామలరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్లు ఇంకొన్నాళ్లు పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం నడుస్తున్న పలు వీక్లీ స్పెషల్ రైళ్లు మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. హౌరా-యశ్వంత్‌పూర్(02863) వీక్లీ ఏసీ స్పెషల్ జూలై 4, 11, 18, 25వ తేదీల్లో (గురువారాలలో) హౌరాలో మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు (శుక్రవారం)తెల్లవారు 2.43 గంటలకు దువ్వాడకు అదేరోజు మధ్యరాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్-హౌరా (02864) వీక్లీ స్పెషల్ రైలు జూలై 6, 13, 20, 27వ తేదీల్లో(ప్రతీ శనివారాలలో) యశ్వంత్‌పూర్‌లో తెల్లవారు 5 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడకు, మరుసటిరోజు (ఆదివారాలలో) మధ్యాహ్నం 1.25 గంటలకు హౌరాకు చేరుకుంటుంది. సంత్రగచ్చి-ఎస్ఎంవీ బెంగళూరు(08845) స్పెషల్ జూలై 5, 12, 19, 26వ తేదీల్లో (ప్రతీ శుక్రవారాలలో) రాత్రి 7 గంటలకు సంత్రగచ్చిలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9 గంటలకు దువ్వాడకు.. మరుసటిరోజు తెల్లవారు 2 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఎస్ఎంవీ బెంగళూరు-సంత్రగచ్చి(08846) స్పెషల్ జూలై 7, 14, 21, 28వ తేదీల్లో (ప్రతీ ఆదివారాలలో ఎస్ఎంవీ బెంగళూరులో తెల్లవారు 3.15 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 8.55 గంటలకు దువ్వాడకు మరుసటిరోజు ఉదయం 10.45 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది.

ఇంటర్‌తోనే ఉపాధి

- వృత్తి విద్యతో ఉజ్వల భవిష్యత్
- కొలువు గ్యారెంటీతో ఒకేషనల్ కోర్సులకు డిమాండ్
- ప్రభుత్వ ఆధ్వర్యంలో విశాఖలో ప్రత్యేక వృత్తి విద్యా కళాశాల
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 48 కాలేజీల్లో ఒకేషనల్ కోర్సులు
- ఈ ఏడాది ప్రవేశాలపై దృష్టి సారించిన అధికారులు


ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులు

విశాఖ విద్య: స్వశక్తితో సత్వరమే ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో నేటితరం యువత అనువైన మార్గాలను అన్వేషిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు గ్యారెంటీగా నిలిచే ఇంటర్మీడియట్ వృత్తి విద్యా(ఒకేషనల్) కోర్సుల వైపు మొగ్గు చూపుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలో విశాఖపట్నం జిల్లాలో 11, అనకాపల్లి జిల్లాలో 27, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 10 కాలేజీల్లో ప్రస్తుతం ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. గతేడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,161 మంది ఒకేషనల్ కోర్సుల్లో అడ్మిషన్లు పొందారు. ఉద్యోగం లేదంటే ఉపాధి గ్యారెంటీ కావడంతో నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా వృత్తి విద్యా కోర్సుల్లో చేరుతున్నారు.

వృత్తి విద్యకు విశాఖలో ప్రత్యేకం

నగరంలోని మద్దిలపాలెంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒకేషనల్ కాలేజీ అందుబాటులో ఉంది. ఇక్కడ 2008-09 విద్యా సంవత్సరం నుంచి వృత్తి విద్య కోర్సులను నిర్వహిస్తున్నారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఇక్కడ ప్రవేశాలు కల్పిస్తున్నారు. రెండేళ్ల కోర్సులో ఇక్కడ ఏటా వెయ్యి మంది వరకు విద్యనభ్యసిస్తున్నారు. గతేడాది 464 మంది చేరగా, ఈ ఏడాది ఇప్పటికే 208 మంది అడ్మిషన్లు పొందారు.

పారామెడికల్ కోర్సులకు డిమాండ్

సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించే మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్, ఫిజియోథెరపీ, ఫ్యాషన్ గార్మెంటరీ తదితర కోర్సులకు విద్యార్థుల నుంచి మంచి డిమాండ్ ఉంది. ఈ కోర్సులకు ప్రైవేట్ కాలేజీల్లో అయితే రెండేళ్లకు ఎంతలేదన్నా రూ.30 వేల వరకు వ్యయం అవుతుంది. కానీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే కళాశాలల్లో అడ్మిషన్ ఫీజు రూ.2,200, పరీక్ష ఫీజుగా రూ.600 చెల్లిస్తే కోర్సు పూర్తి చేయవచ్చు. విద్యార్థుల ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో సరికొత్త ఒకేషనల్ కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్, ఆఫీస్ అసిస్టెంట్ షిప్, బ్యాంకింగ్, రిటైల్ మార్కెటింగ్ వంటి కామర్స్ మెనేజ్‌మెంట్ కోర్సులు చేసిన వారిని ఉద్యోగాల్లో తీసుకునేందుకు కార్పొరేట్ కంపెనీలు ముందుకొస్తుండటంతో ఈ కోర్సులకు కూడా మంచి ఆదరణ ఉంది. ఇదే మాదిరి మెకానికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్, ప్రింటింగ్ టెక్నాలజీ వంటి కోర్సులు కూడా నిర్వహిస్తున్నారు.

అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి



జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి సారించాం. రెండో ఫేజ్ అడ్మిషన్లకు ఈ నెల 30 వరకు గడువు ఉంది. ఒకేషనల్ కోర్సులకు విద్యార్థుల నుంచి మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో 9 ఒకేషనల్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో లక్ష్యం మేరకు అడ్మిషన్లు జరిగేలా కాలేజీల ప్రిన్సిపాళ్లతో ప్రతి రోజూ సమీక్షిస్తున్నాం.

-బి.సుజాత, ఇంటర్ విద్యాధికారి, అనకాపల్లి జిల్లా

ఇంటర్‌తోనే ఉద్యోగం పొందవచ్చు



ఇంటర్మీడియట్ స్థాయిలో వృత్తి విద్య అభ్యసించే విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. గతేడాది నుంచి కాలేజీల్లోనే క్యాంపస్ సెలక్షన్లు నిర్వహిస్తున్నాం. కాలేజీల్లో నాణ్యమైన బోధన అందించేలా పర్యవేక్షణ చేస్తున్నాం. ఇంటర్మీడియట్ ప్రవేశాల లక్ష్యం మేరకు పూర్తయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

-బి. రాధ, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి, విశాఖ జిల్లా

ఒకేషనల్ కోర్సులకు డిమాండ్



మా కాలేజీల్లో జనరల్‌తో పాటు ఒకేషనల్ కోర్సులు కూడా నిర్వహిస్తున్నాం. ఫ్యాషన్ గార్మెంటరీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులకు బాగా డిమాండ్ ఉంది. వృత్తి విద్యకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. గతంలో అప్రెంటీస్ శిక్షణ కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడేవారు. కానీ ఇప్పుడా సమస్య లేదు.

-కె.విజయ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ

అదుపు తప్పిన ట్రాలర్


సాకేతపురం జంక్షన్ వద్ద అదుపుతప్పిన ట్రాలర్

గోపాలపట్నం: మర్రిపాలెం యార్డ్ నుంచి షీలానగర్ వైపు వెళ్తున్న భారీ ట్రాలర్ సాకేతపురం జంక్షన్ వద్ద అదుపుతప్పి.. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. మర్రిపాలెం యార్డ్ నుంచి ఐరన్ లోడుతో ట్రాలర్ మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో షీలానగర్ వైపు బయలుదేరింది. జాతీయ రహదారిపై సాకేతపురం జంక్షన్ వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని డ్రైవర్ తప్పించబోగా.. అదుపు తప్పింది. ఫ్రీలెఫ్ట్‌లో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి.. ట్రాలర్ దిగువకు జారి నిలిచిపోయింది. అప్పటికి ఐదు నిమిషాల ముందు పారిశుద్ధ్య కార్మికులు అక్కడే ఉన్నారు. మస్టర్ వేసుకుని, టీ తాగి పనులకు వెళ్లారు. వారు అక్కడే ఉండి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. ఉదయం సమయం కావడంతో ట్రాఫిక్ రద్దీ కూడా లేదు. ట్రాలర్ కిందకు జారి ఉంటే.. కిందన ఉన్న హోటల్‌లోకి చొచ్చుకుపోయేది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్, ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నీట్ మళ్లీ నిర్వహించాలి


జీవీఎంసీ గాంధీ విగ్రహం రోడ్డులో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: నీట్-2024ను మళ్లీ నిర్వహించాలని, ఎన్టీఏను రద్దు చేసి బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మెడికల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం ఆవరణలో మంగళవారం నిరసన తెలిపిన విద్యార్థులు ఆశీలమెట్ట జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, గురజాడ విగ్రహం మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.రాము మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ దుర్మార్గమని, దీని వల్ల లక్షలాది మంది విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. పేపర్ లీకేజీకి బీజేపీ, మోదీ ప్రభుత్వం బాధ్యత వహించాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలకు మోదీ క్షమాపణ చెప్పాలన్నారు. నీట్ యూజీ, పీజీ పరీక్షల నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జి.అజయ్, పి.సాయితేజ, రవి, నరేష్, అఖిల్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు యు.ఎస్.ఎన్.రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాపారులకు మార్గదర్శి గ్రంధి మనోజ్

ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ ఎండీ సుగంధి


రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న బ్లడ్‌బ్యాంక్ ఎండీ సుగంధి, సంస్థ చైర్‌పర్సన్ మల్లికా రత్నకుమారి

సీతమ్మధార: విశాఖపట్నంలో ఎంతో మంది వ్యాపారులకు దివంగత గ్రంధి మనోజ్‌కుమార్ మార్గదర్శిగా నిలిచారని ఏఎస్ రాజా బ్లడ్‌బ్యాంక్ ఎండీ డాక్టర్ సుగంధి కొనియాడారు. ద్వారకానగర్‌లోని వైభవ్ జ్యూయలర్స్ షోరూమ్‌లో సంస్థ వ్యవస్థాపకుడు మనోజ్ 58వ జయంతి పురస్కరించుకుని మంగళవారం పలు సంక్షేమ, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అద్భుతమైన డిజైన్లు, అత్యున్నత కస్టమర్ సర్వీస్, ఉద్యోగుల సత్ప్రవర్తనతో వైభవ్ జ్యూయలర్స్ వినియోగదారుల ఆదరాభిమానాలు పొందిందన్నారు. ఏటా మనోజ్ జయంతి రోజున రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 75 మందికి పైగా ఉద్యోగులు రక్తదానం చేశారు. లీ హెల్త్ డొమైన్(ఐ) ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం, మ్యాక్స్ విజన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం జరిగింది. సంస్థ చైర్‌పర్సన్ భారత మల్లికా రత్నకుమారి గ్రంధి, హోల్ టైమ్ డైరెక్టర్, సీఎఫ్‌వో సాయి కీర్తన, సీవోవో రఘాల్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింధూరి, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, వైభవ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఇగ్నోలో ఎంబీఏ కొత్త కోర్సులు ప్రారంభం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో ఎంబీఏ కొత్తకోర్సులు అందుబాటులోకి వచ్చినట్లు విశాఖ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మరావు వెల్లడించారు. ఎంబీఏ హెల్త్ కేర్, హాస్పటల్ మేనేజ్‌మెంట్, ఎంబీఏ అగ్రి మేనేజ్‌మెంట్ కోర్సులు కొత్త అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. రెండేళ్ల కాలవ్యవధిలో అందిస్తున్న ఈ కోర్సుల్లో ఏదైనా డిగ్రీ అర్హతతో చేరవచ్చన్నారు. రూ.64 వేలు కోర్సు ఫీజుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇగ్నో వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ అడ్మిషన్స్ పొందవచ్చన్నారు.

సంత్రగచ్చి-విశాఖపట్నం రీ షెడ్యూల్



తాటిచెట్లపాలెం: మంగళవారం సాయంత్రం 5 గంటలకు సంత్రగచ్చిలో బయల్దేరాల్సిన సంత్రగచ్చి- విశాఖపట్నం (08505) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు మూడున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 8.20 గంటలకు బయల్దేరింది. అంతే ఆలస్యంగా విశాఖపట్నం చేరుకోనున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

పరివర్తన

మొదట్లో సరదాగా తీసుకున్న మత్తు పదార్థాలే బానిసను చేస్తాయి. ఇక వాటి నుంచి బయటపడలేక ఆత్మస్థైర్యం కోల్పోతారు. ఏ పనీ చేయడానికి ఇష్టపడరు. ఆపై సంపాదన లేక ఆర్థిక ఇబ్బందులు పడతూ కుటుంబాలను పోషించలేక బలవన్మరణాలకు పాల్పడుతుంటారు. ఇలా ఎంతోమంది జీవితాలు ఛిన్నాభిన్నమవుతున్న నేపథ్యంలో అటువంటి వారిలో పరివర్తన తీసుకురావడానికి డీ అడిక్షన్ సెంటర్ కృషి చేస్తోంది. మరలా జనజీవన స్రవంతిలో సాధారణ జీవనం ప్రారంభించేలా పనిచేస్తోంది.


గ్రామాల్లో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

- మత్తుకు బానిసైన వారికి చికిత్స
- జిల్లాలో డీ అడిక్షన్ సెంటర్ సేవలు
- నెల రోజులపాటు ఉచిత వైద్యం, భోజన వసతి
- ఇప్పటి వరకు 250 మందికి విముక్తి

నేడు ప్రపంచ మాదక ద్రవ్యాల విముక్తి దినోత్సవం



నక్కపల్లి: మత్తుపదార్థాలకు బానిసయితే జీవితం నాశనం కావడంతోపాటు వారిపై ఆధారపడ్డ ఆ కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతాయి. తమ ఆరోగ్యాలను పాడుచేసుకోవడంతోపాటు, సమాజంలోనూ చులకనైపోతారు. ఇటువంటి వారు మత్తుపదార్థాల నుంచి బయట పడ్డారంటే కొత్త జీవితాన్ని ప్రారంభించినట్లే. ఇటువంటి వ్యసనపరులను మత్తు నుంచి విముక్తి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్వచ్ఛంద సంస్థల సహకారంతో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఇప్పటి వరకు పట్టణాలకే పరిమితమైన ఇటువంటి డీ అడిక్షన్ సెంటర్ (వ్యసన విముక్తి కేంద్రం) అనకాపల్లి జిల్లాలోనూ ప్రారంభమైంది. అనకాపల్లి మండలం పిసినికాడ కేంద్రంగా పరివర్తన పేరుతో వ్యసన విముక్తి కేంద్రం అర్నెల్ల క్రితం తమ కార్యకలాపాలు ప్రారంభించింది. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ సంస్థ పర్యవేక్షణలో సీడ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఏర్పాటైన వ్యసన విముక్తి కేంద్రం వ్యసనపరుల్లో పరివర్తన తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది. ఇప్పటివరకు 45 మందిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకుని చికిత్స అందించి వారిలో పరివర్తన తీసుకొచ్చింది. 250 మందిని ఔట్‌పేషెంట్లుగా కౌన్సెలింగ్ చికిత్స అందించి మత్తు పదార్థాలకు దూరం చేసింది.

వైద్య సిబ్బంది పర్యవేక్షణలో..

కేంద్ర ప్రభుత్వ సహకారం, పర్యవేక్షణలో నడిచే పరివర్తన కేంద్రంలో వైద్యుడు, నర్సులు, కౌన్సెలర్లు, మానసిక వైద్యనిపుణులు, యోగా ఇన్‌స్ట్రక్టర్లు, కుటుంబ సలహాదారులు, ఆధ్యాత్మిక వేత్తలు, మనోల్లాస ఉపాధ్యాయులు పని చేస్తారు. వీరందరి పర్యవేక్షణలో ఇక్కడ ఒకేసారి 15 మంది పేషెంట్లను చేర్చుకుని ఉచిత భోజన వసతి కల్పించి వైద్య సహాయం అందించే ఆస్పత్రి ఉంది. నెల రోజులపాటు ఇక్కడ అన్ని వసతి సదుపాయాలు కల్పిస్తారు.

బాధితుల గుర్తింపు ఇలా...

విముక్తి కేంద్రంలో పనిచేసే సిబ్బంది, కౌన్సెలర్లు ఎక్కువగా మద్య ప్రభావిత గ్రామాలను, ఏరియాలను గుర్తిస్తారు. అక్కడ బాధిత కుటుంబాలతో మమేకమవుతారు. వారికి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రామాణికాలను అనుసరించి పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో బాధితుడిని కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబడతారు. వచ్చిన సమాధానాలను బట్టి వ్యసన తీవ్రతను గుర్తిస్తారు. అటువంటి వారికి ఇన్‌పేషెంట్లుగా లేదా ఔట్‌పేషెంట్లుగా చికిత్స చేయాలా అనేది నిర్ధారిస్తారు.

చికిత్స ఇలా... : మత్తుపదార్థాలకు బానిసైన వారిని కుటుంబ సభ్యులు, అంగన్‌వాడీ కేంద్రాల అవగాహన కార్యక్రమాల ద్వారా గుర్తిస్తారు. ఆ తర్వాత విముక్తి కేంద్రంలో చేర్చుకుంటారు. వ్యసనపరుల ఆరోగ్య పరిస్థితిని తీవ్రతను బట్టి రెండు రకాలుగా చికిత్స అందిస్తారు. ఇన్‌పేషెంట్లయితే నెల రోజుల పాటు ఈ కేంద్రంలో ఉండాలి. ఔట్‌పేషెంట్లు వారానికి, నెలకొకమారు కేంద్రానికి వచ్చి మందులు వాడటం, కౌన్సెలింగ్ తీసుకోవడం వంటివి చేస్తారు. వీరితో ఒకేసారి మాన్పించడం కూడా కష్టమే. అలా చేస్తే మంచి కంటే చెడు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అస్వస్థతకు గురయ్యే అవకాశాలు ఉంటాయి. వారే స్వచ్ఛందంగా మత్తు పదార్థాలను మానేసే స్థాయికి తీసుకొస్తారు. మత్తు పదార్థాల నుంచి దూరం కావడం కోసం ఇక్కడ మందులు, ఇంజక్షన్, కౌన్సెలింగ్ ద్వారా చికిత్స అందిస్తారు. వారికి యోగా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఉల్లాసం, ఆనందం కలిగించే కార్యక్రమాలు నిర్వహిస్తారు. మానసికంగా వీరంతా మత్తుకు దూరమయ్యేలా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వీరికి ఈ పునరావాస కేంద్రంలో టీవీ, దిన, మాసపత్రికలు, మ్యాగజైన్లు, ఆధ్యాత్మిక గ్రంథాలను అందుబాటులో ఉంచుతారు. వీరికి రోజూ పతంజలి, అష్టాంగ యోగాసనాలు, ప్రాణాయామం కూడా నేర్పిస్తారు. చికిత్స పూర్తయిన తర్వాత కూడా వీరిపై రెండేళ్లపాటు పర్యవేక్షణ ఉంటోంది.

కలలోనూ ఊహించలేదు

నేను ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాను. ఫొటో, వీడియో షూటింగ్‌లు చేయడంతో పాటు, పొలిటికల్ పార్టీ సమావేశాలను కవర్ చేసేవాడిని. బాగా డబ్బులు వచ్చేవి. దాంతో విపరీతంగా తాగేవాడిని. తాగిన మైకంలో భోజనమూ చేసేవాడిని కాదు. ఆరోగ్యం పాడయ్యేది. ఒక షూటింగ్‌కు వెళ్లి కార్యక్రమం అనంతరం ఇచ్చిన డబ్బులతో విపరీతంగా మద్యం సేవించాను. మైకంలో అక్కడే పడిపోయాను. లక్షలాది రూపాయల విలువైన నా కెమెరాలు, ఫోన్ చోరీకి గురయ్యాయి. అప్పటి నుంచి డిప్రెషన్‌లోకి వెళ్లిపోయి అప్పు చేసి తాగేవాడిని. అనకాపల్లిలో పరివర్తన డీ అడిక్షన్ సెంటరు ఏర్పాటు చేసిన విషయాన్ని నా భార్య తెలుసుకుని నన్ను అక్కడ చేర్పించింది. చేరిన రెండు రోజుల పాటు ఇబ్బంది పడ్డాను. వెళ్లిపోతానని మొండికేస్తే అక్కడ సిబ్బంది, కౌన్సెలర్లు నాకు కౌన్సెలింగ్ ఇచ్చి నెలరోజులపాటు చికిత్స చేశారు. మత్తు పదార్థాల నుంచి విముక్తి కోసం మందులు, ఇంజక్షన్‌లు ఇచ్చారు. యోగా నేర్పించడం, పత్రికలు, పుస్తకాలు చదివించడం, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేశారు. దీంతో నెలరోజులు నేను మద్యం అనేది దరిదాపుల్లో లేకుండా ఉండగలిగాను. డిశ్చార్జి అయ్యాక ఇంటికి వచ్చాను. ప్రస్తుతం మద్యం జోలికి వెళ్లడం లేదు. ఎంచక్కా మామూలుగా షూటింగ్‌లకు వెళ్తూ వచ్చిన సంపాదనతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఎప్పుడైనా ఇబ్బంది ఏర్పడితే పరివర్తన కేంద్రం వారితో ఫోన్లో మాట్లాడి సమస్యను పరిష్కరించుకుంటున్నాను. మామూలు మనిషిని అవుతానని కలలోనూ ఊహించలేదు.

– సాంబమూర్తి, ఫొటోగ్రాఫర్, మాకవారిపాలెం

(పేరు, ఊరు మార్చాం)